

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 11-09-2025 | సంపుటి - 25 | సంచిక - 121 | రూ : 4 | పేజీలు: 8




## 10 వేల మందితో బతుకమ్మ!

- ప్రపంచ రికార్డు లక్ష్యంగా...
- 28న ఎల్బీ స్టేడియంలో నిర్వహణకు సన్నాహాలు

హైదరాబాద్: బతుకమ్మ పండగను 10 వేల మంది ఆడపడుచులతో నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. 2016లో గిన్నిస్ బుక్‌లో స్థానం కోసం బల్దియా అధికారులు విఫలయత్నం చేశారు. భారీ వర్షం కారణంగా అప్పుడు చేసిన ఏర్పాట్లు ఫలితమివ్వలేదు. ఈసారి పకడ్బందీ ఏర్పాట్లతో రంగంలోకి దిగుతామని జీహెచ్ఎం... ంది.

తరువాయి 2లో

## దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే'.. ఈసీ

- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో సీఈసీ కీలక భేటీ
- ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా సవరణ
- ఈసీ చర్యను సమర్థించిన సుప్రీంకోర్టు ధర్మాసనం




**ఢిల్లీ, సెప్టెంబర్ 10 :** దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే-ఎస్ఐఆర్) చేపట్టనున్నట్లు గతంలోనే ప్రకటించిన ఎన్నికల సంఘం.. తాజాగా ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో బుధవారం కీలక సమావేశం నిర్వహించనుంది. రాష్ట్ర ఎన్నికల సంఘాల ప్రధాన అధికారులతో దేశ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ మరికాసేపట్లో భేటీ కానున్నారు.

తరువాయి 2లో



2లో

## హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు చెక్

- రాజీవ్ రహదారి విస్తరణకు 83 ఎకరాల భూమి కేటాయించాలని కోరిన సీఎం
- మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణంపై చర్చ
- తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశంపైనా ప్రస్తావన

# కర్ఫ్యూ గుప్పిట నేపాల్

- నిషేధాజ్ఞలు విధించిన సైన్యం
- నిర్మానుష్యంగా కాఠ్‌మాండూ
- తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ముగ్గురి పేర్లు తెరపైకి..
- అల్లర్ల ఆసరాగా జైళ్ల నుంచి 7వేల మంది ఖైదీల పరారీ
- రాజ్యాంగాన్ని మార్చాలని ఆందోళనకారుల డిమాండ్

కాఠ్‌మాండూ: ప్రభుత్వ నేతల అవినీతిపై నేపాల్‌లో చెలరేగిన హింస సద్దుమణిగింది. తీవ్ర హింసాత్మక ఘటనలు జరిగిన మంగళవారమే ప్రధాని కేపీ శర్మ ఓలిసహా మంత్రులు రాజీనామా చేయడంతో బుధవారం ఆందోళనకారులు శాంతించారు. దీనికితోడు సైన్యం నిషేధాజ్ఞలు విధించడంతోపాటు కర్ఫ్యూను అమల్లోకి తేవడంతో వీధుల్లోకి ఎవరూ రాలేదు. ఇక తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ముగ్గురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారికి జెన్‌జెడ్ ఆమోదం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇదే అదనుగా దేశంలోని పలు జైళ్ల నుంచి 7,000 మంది ఖైదీలు పరారయ్యారు. ఇక త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అధికారులు తెరిచారు. అయితే భారత్ నుంచి వెళ్లే విమానాలన్నీ రద్దయ్యాయి. దేశంలో శాంతి భద్రతల బాధ్యతలను మంగళవారం

తరువాయి 2లో






2లో

## యూకే కొరడా..

### 20,000 మంది భారతీయుల భవితవ్యం ప్రశ్నార్థకం!

- బ్రిటన్‌లో భారతీయులకు బ్రేక్
- వీసాలపై ఉక్కుపాదం మోపనున్న కొత్త ప్రభుత్వం!

## క్షమించరాని తప్పు చేశారు

## బీఆర్ఎస్ పై రేణుకా చౌదరి ఫైర్

- ఉప రాష్ట్రపతి ఎన్నికల ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్ ఎంపీలు
- బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి తీవ్ర విమర్శలు
- కాళేశ్వరం సీబీఐ విచారణ భయంతోనే ఓటింగ్ లో పాల్గొనలేదని ఆరోపణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరుగుతున్నందునే, ఆ భయంతో బీఆర్ఎస్ ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. వారి చర్య ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, ఇది క్షమించరాని తప్పిదమని ఆమె అన్నారు. ఇటీవల జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియపై ఆమె మీడియాతో

తరువాయి 2లో



## నాది, పవన్ కల్యాణ్ ఆలోచన ఒక్కటే

రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం : ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో సహాయక కేంద్రం

- తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- ముగ్గురు అధికారుల బృందానికి బాధ్యతల అప్పగింత
- అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు సూచన



**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** నేపాల్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో పలువురు తెలంగాణవాసులు అక్కడ చిక్కుకుపోవడంతో, వారికి సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ సహాయ కేంద్రం బాధ్యతలను ముగ్గురు

తరువాయి 2లో

# నాది, పవన్ కల్యాణ్ ఆలోచన ఒక్కటే : ముఖ్యమంత్రి చంద్రబాబు

* **మనం పాలకులు కాదు, ప్రజలకు సేవకులం**
* **సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు, కామన్ మ్యాన్**
* **అహంకారం, అవినీతి, అలసత్వం దరికి రానివ్వొద్దు**
* **నాది, పవన్ కల్యాణ్ ఆలోచన ఒక్కటే**
* **రాష్ట్రానికి ప్రధాని మోదీ అన్ని విధాలా అండగా ఉన్నారు**
* **సంక్షేమం, అభివృద్ధి రెండూ సూపర్ హిట్ చేస్తాం**
* **'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభలో చంద్రబాబు**

**అమరావతి, సెప్టెంబర్ 10 :** "మనం పాలకులం కాదు, ప్రజలకు సేవకులం. ముఖ్యమంత్రి అంటే చీఫ్ మినిస్టర్ కాదు, కామన్ మ్యాన్" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులకు, కార్యకర్తలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. దర్జాలు, ఆర్భాటాలు ప్రదర్శించడం కుదరదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అహంకారం, అవినీతి, అలసత్వం వంటివి దరిచేరనివ్వొద్దని గట్టిగా సూచించారు. బుధవారం అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభలో ఆయన మాట్లాడుతూ, తన ఆలోచన, మిత్రపక్ష నేత పవన్ కల్యాణ్ ఆలోచన ఒక్కటేనని, రాష్ట్ర పునర్నిర్మాణం, ప్రజలకు న్యాయం చేయడమే తమ ఏకైక ధ్యేయమని స్పష్టం చేశారు. "మాకు ఈ ధ్యాస తప్ప వేరే ధ్యాస లేదు. ప్రజల భవిష్యత్తే మాకు ముఖ్యం" అని ఆయన అన్నారు. ఒక ఎమ్మెల్యే, కార్యకర్త లేదా అధికారి తప్పు చేసినా, ఆ చెడ్డపేరు ప్రభుత్వానికే వస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి మంచి చేయాలనే తమ సంకల్పానికి కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ఈ సహకారానికి ప్రధానమంత్రి మోదీకి ఆయన వేదికగా ధన్యవాదాలు తెలియజేశారు. మూడు పార్టీల కార్యకర్తలు కాలర్ ఎగరేసుకుని తిరిగేలా పాలన అందిస్తామని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. ఐకమత్యంతో కలిసికట్టుగా ఉంటేనే బలం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం కోసం తన శక్తిమేర శ్రమిస్తానని, 'హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' సాధనే తన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సూపర్ హిట్ అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. "వైకుంఠపాళి ఆట వద్దు. నిరంతర పాలనతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ 1 స్థానానికి తీసుకెళ్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. తాను 47 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యానని చంద్రబాబు అన్నారు. రామరాజ్యం లాంటి పాలన ఇచ్చే బాధ్యత తనది, పవన్ కల్యాణ్‌ది అన్నారు. ప్రజల కోసం పని చేస్తున్నామని, అన్నీ చేస్తామని, సహకారం కావాలని కోరారు. కలిసి పోటీ చేశాం.. కలిసి గెలిచాం.. కలిసి పని చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ప్రజల దీవెనలతో ఈ హిట్ కాంబినేషన్ కొనసాగుతోని అన్నారు.

## దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా
# 'స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే'.. ఈసీ

(మొదటిపేజీ తరువాయి)
బీహార్ లో ఇటీవల ఈ సర్వే చేపట్టి ఓటర్ జాబితాలో పెద్ద సంఖ్యలో అనర్హులను తొలగించిన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు ఈ సర్వే చేపట్టడంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. దీనిపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, ఈసీ చర్య రాజ్యాంగబద్ధమేనని ధర్మాసనం సమర్థించింది. రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులతో జరగనున్న సమావేశంలో ఈసీ సీనియర్ అధికారులు ఎస్ఐఆర్‌పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. బీహార్ లో ఈ విధానాన్ని అమలు చేసిన తీరును ఆ రాష్ట్ర ఎన్నికల అధికారి వెల్లడించనున్నారు. అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది. వచ్చే ఏడాది తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివర్లోనే దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## నేపాల్‌లో చిక్కుకున్న
# తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో సహాయక కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)
అధికారుల బృందానికి అప్పగించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వం తెలిపింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాట్మండ్‌లోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. నేపాల్‌లో ఎవరైనా తెలంగాణ వాసులు చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులను ఈ కింది నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. వందన, రెసిడెంట్ కమిషనర్, ప్రైవేట్ సెక్రటరీ అండ్ లైజన్ హెడ్ +91 9871999044, రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ +91 9643723157, హెచ్ చక్రవర్తి, ప్రజా సంబంధాల అధికారి +91 9949351270.

# కర్ఫ్యూ గుప్పిట నేపాల్

(మొదటిపేజీ తరువాయి)
రాత్రి నుంచే చేపట్టిన సైన్యం.. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకూ దేశవ్యాప్తంగా నిషేధాజ్ఞలు విధించింది. సాయంత్రం 5 నుంచి గురువారం ఉదయం 6 వరకూ కర్ఫ్యూ అమల్లో ఉంటుందని ప్రకటించింది. కాఠ్‌మాండూ వీధుల్లో బుధవారం సైన్యం కవాతు నిర్వహించింది. ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించింది. దీంతో వీధులన్నీ బోసిపోయాయి. ఎటువంటి ఆందోళనలు నిర్వహించినా, విధ్వంసాలు, గృహ దహనాలకు పాల్పడ్డా, వ్యక్తులపై దాడులు చేసినా, ఆస్తులకు నష్టం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో సైన్యం హెచ్చరించింది. ఇదే అదనుగా అత్యాచారాలూ జరిగే ప్రమాదముందని, అటువంటి వాటిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. నేపాల్‌లో చిక్కుకుపోయిన విదేశీ పర్యాటకులు సమీపంలోని పోలీస్ స్టేషన్లను సంప్రదించాలని సూచించింది.

*** కాఠ్‌మాండూ జైలు నుంచి పారిపోయిన ఖైదీలను వెనక్కు తీసుకొస్తున్న పోలీసులు**

* అల్లర్లను అదనుగా తీసుకుని నేపాల్‌లోని వివిధ జైళ్ల నుంచి 7,000 మంది ఖైదీలు పరారయ్యారు. పశ్చిమ నేపాల్‌లోని జువైనల్ హోంలో జరిగిన ఘర్షణలో ఏడుగురు జువైనల్స్ మరణించారు. ఖైదీల పరారీ సందర్భంగా పలు జైళ్లలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఒక్క జుంప్కా జైలు నుంచే 1,575 మంది ఖైదీలు పరారయ్యారు.
* అల్లర్ల కారణంగా మంగళవారం మూసివేసిన త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని బుధవారం సాయంత్రం తెరిచారు. వివరాల కోసం సంబంధిత విమానయాన సంస్థలను ప్రయాణికులు సంప్రదించాలని విమానాశ్రయ మేనేజ్‌మెంట్ సూచించింది. అయితే భారత్‌నుంచి వెళ్లే విమానాలన్నీ బుధవారమూ రద్దయ్యాయి. ఇందులో ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్ ఉన్నాయి.

**భారతీయ పర్యాటకుల పాట్లు**

* విమానాలు రద్దు కావడంతో నేపాల్‌లో పలువురు భారతీయ పర్యాటకులు చిక్కుకుపోయారు. చాలా మంది హోటళ్లలోనే ఉండిపోయారు. ఒక్క హోటల్‌లోనే 150 మంది భారతీయులు ఉన్నారు. అందులో 20 మంది బెంగళూరుకు చెందినవారు.
* నేపాల్ పరిస్థితుల నేపథ్యంలో ఉత్తరాఖండ్ సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తత ప్రకటించారు.
* ఢిల్లీ కాఠ్‌మాండూ బస్సు సర్వీసు రద్దయింది. ఈ బస్సు 1,167 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.
* నేపాల్‌లో మళ్లీ రాజరికాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నది లెఫ్ట్‌పార్టీల ఆందోళన.

**నిరసనకారుల డిమాండ్లివే..**

* ఆందోళనలతో ప్రభుత్వాన్ని కూలదోసిన జెన్‌జెడ్ ఉద్యమకారులు తమ డిమాండ్లను వెల్లడించారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చాలని, లేదంటే సవరణలు చేసి ప్రభుత్వ పాలనలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండు చేశారు. 3 దశాబ్దాలుగా రాజకీయ నేతలు దోచుకున్న ఆస్తులపై దర్యాప్తు చేపట్టాలని కోరుతున్నారు. ఈ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అధికారికంగా అమరులుగా గుర్తించి, వారికి గౌరవంతోపాటు సాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిరుద్యోగం, వలసలు, సామాజిక అన్యాయం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు. 'ప్రస్తుతం ఉన్న హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌ను వెంటనే రద్దుచేయాలి.

## క్షమించరాని తప్పు చేశారు
# బీఆర్ఎస్ పై రేణుకా చౌదరి ఫైర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరుగుతున్నందునే, ఆ భయంతో బీఆర్ఎస్ ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. వారి చర్య ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, ఇది క్షమించరాని తప్పిదమని ఆమె అన్నారు. ఇటీవల జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియపై ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ ఓటింగ్‌కు గైర్హాజరు కావడం ద్వారా భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందని రేణుకా చౌదరి మండిపడ్డారు. రాజకీయాల్లో గెలుపోటములు అనేవి కేవలం నంబర్లకు సంబంధించిన విషయమేనని, కానీ రాజ్యాంగబద్ధమైన ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండటం మాత్రం చాలా పెద్ద తప్పిదమని ఆమె పేర్కొన్నారు. భారత ఉప రాష్ట్రపతిగా ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆయన ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో మొత్తం 13 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు, బీజేడీకి చెందిన ఏడుగురు, అకాలీదళ్ నుంచి ఒకరు, ఒక ఇండిపెండెంట్ సభ్యుడు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ తీరుపై రేణుకా చౌదరి ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.



# 10 వేల మందితో బతుకమ్మ!

హైదరాబాద్: బతుకమ్మ పండగను 10 వేల మంది ఆడపడుచులతో నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. 2016లో గిన్నిస్ బుక్‌లో స్థానం కోసం బల్దియా అధికారులు విఫలయత్నం చేశారు. భారీ వర్షం కారణంగా అప్పుడు చేసిన ఏర్పాట్లు ఫలితమివ్వలేదు. ఈసారి పకడ్బందీ ఏర్పాట్లతో రంగంలోకి దిగుతామని జీహెచ్ఎంసీ ధీమా వ్యక్తంచేస్తోంది. కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో పట్టణ సామాజికాభివృద్ధి విభాగం అదనపు కమిషనర్ ఎస్.పంకజ ఏర్పాట్లు చేస్తున్నారు. "జీహెచ్ఎంసీ తరఫున ఆరు వేల మందిని సమీకరిస్తున్నాం. మెప్మా, సెర్ప్‌లు శివారు జిల్లాల నుంచి మరో నాలుగు వేల మందికి తగ్గకుండా సమీకరిస్తాం. వారందరికీ 27న శిక్షణ ఇచ్చి, 28న బతుకమ్మ వేడుకను నిర్వహిస్తాం. ఈ వేడుక కోసం తీరొక్క పూలతో 52 అడుగుల బతుకమ్మను సిద్ధం చేస్తున్నాం" అని ఆమె వెల్లడించారు. దసరా ఉత్సవాలను సైతం ఘనంగా నిర్వహించేందుకు వేర్వేరు ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

* 2226 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు: దసరా సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 22 నుంచి 26 వరకు దేవాలయాలు, వారసత్వ కట్టడాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.
* 27న కార్నివాల్: హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై 27న హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కార్నివాల్ ఉంటుంది. తెలంగాణ పిండి వంటకాలు, ఇతరత్రా తినుబండారాలు, ఆహార పదార్థాల ప్రదర్శన, వాటి విక్రయ కేంద్రాలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి.
* 29న బతుకమ్మ పోటీలు: పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ పోటీలు, మహిళా బైక్ రైడర్స్‌తో సమావేశాలు నిర్వహిస్తారు.
* 30న ర్యాలీ: సచివాలయం ముందున్న అమరవీరుల స్తూపం నుంచి వందల మంది మహిళలు ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఘాట్ వరకు బతుకమ్మ ఆడుతూ ర్యాలీగా వెళ్తారు.

## హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు చెక్
# రక్షణ భూముల కోసం రాజ్ నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

* **రాజీవ్ రహదారి విస్తరణకు 83 ఎకరాల భూమి కేటాయించాలని కోరిన సీఎం**
* **మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణంపై చర్చ**
* **తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశంపైనా ప్రస్తావన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఈరోజు ఆయన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమై, హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అవసరమైన రక్షణ శాఖ భూములను రాష్ట్రానికి బదలాయించాలని కోరారు. మహానగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరమని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా హైదరాబాద్ కరీంనగర్ రామగుండంలను కలిపే రాజీవ్ రహదారిపై ప్యాకేజీ జంక్షన్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అత్యవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆ మార్గంలో ప్రయాణం సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన మెహదీపట్నం రైతుబజార్ వద్ద పాదచారుల సౌకర్యార్థం స్కై వాక్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోందని, దీనికి కూడా కొంత రక్షణ భూమిని కేటాయించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో తెలంగాణలో కొత్తగా సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# యూకే కొరడా.. 20,000 మంది భారతీయుల భవితవ్యం ప్రశ్నార్థకం!

**బ్రిటన్, సెప్టెంబర్10:** బ్రిటన్‌లో నివసిస్తున్న వేలాది మంది భారతీయుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది. వీసా గడువు ముగిసినా తమ దేశాలకు తిరిగి వెళ్లని వారిని వెనక్కి తీసుకునే విషయంలో సహకరించని దేశాలపై ఉక్కుపాదం మోపాలని యూకే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జాబితాలో భారత్, పాకిస్థాన్, నైజీరియాలు ఉండటంతో, ఆయా దేశాల పౌరులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధించనున్నట్లు బ్రిటన్ కాబోయే హోం సెక్రటరీ (లేబర్ పార్టీ షాడో హోం సెక్రటరీ) యెవెట్ కూపర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అక్రమ వలసదారులను నియంత్రించడంలో భాగంగా బ్రిటన్ ప్రభుత్వం 'రిటర్న్స్' ఒప్పందాలను (తిరిగి పంపించే ఒప్పందాలు) కఠినంగా అమలు చేయాలని భావిస్తోంది. ఈ ఒప్పందాల ప్రకారం వీసా గడువు ముగిసిన లేదా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన తమ పౌరులను ఆయా దేశాలు తిరిగి వెనక్కి తీసుకోవాలి. అయితే, ఈ ప్రక్రియలో కొన్ని దేశాలు సహకరించడం లేదని బ్రిటన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో వీసా విధానాన్ని ఒక 'బేరసారాల అస్త్రంగా' వాడుకోవాలని కొత్త ప్రభుత్వం యోచిస్తోంది. ఒకవేళ భారత్ వంటి దేశాలు తమ పౌరులను వెనక్కి తీసుకోవడంలో జాప్యం చేస్తే తొలుత వీసా దరఖాస్తు రుసుములను భారీగా పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయాలని, చివరి అస్త్రంగా ఆ దేశ పౌరులకు తాత్కాలికంగా లేదా పూర్తిగా వీసాలను నిలిపివేయాలని యోచిస్తోంది.

**భారతీయులే అధికం**

బ్రిటన్ హోం ఆఫీస్ గణాంకాల ప్రకారం వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండిపోయిన వారిలో భారతీయులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 2020 నాటికే దాదాపు 20,706 మంది భారతీయులు ఈ జాబితాలో ఉన్నట్లు అంచనా. గత ఏడాది భారత్ సుమారు 7,400 మందిని వెనక్కి తీసుకున్నప్పటికీ, పాస్‌పోర్టులు లేని వారిని గుర్తించి, వారికి అత్యవసర ప్రయాణ పత్రాలు జారీ చేయడంలో భారత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని యూకే అధికారులు ఆరోపిస్తున్నారు.

**బెడిసికొట్టనున్న సంబంధాలు**

బ్రిటన్ ఏకపక్షంగా తీసుకునే ఈ నిర్ణయం భారత్ వంటి కీలక భాగస్వామ్య దేశంతో ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన మైగ్రేషన్ అబ్జర్వేటరీ నిపుణుడు డాక్టర్ పీటర్ వాల్ష్ మాట్లాడుతూ "యూకే వీసా వ్యవస్థను అత్యధికంగా వినియోగించుకుంటున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇటువంటి బెదిరింపు ధోరణిని భారత్ తేలిగ్గా తీసుకోదు. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య, విద్యా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని అభిప్రాయపడ్డారు. కాగా, ఈ సమస్యను పరిష్కరించడానికి ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, అవసరమైతే ఏ దేశానికైనా వీసాలను ఆయుధంగా ప్రయోగించడానికి సిద్ధమని యెవెట్ కూపర్ స్పష్టం చేశారు. దీంతో బ్రిటన్‌లో చదువు, ఉద్యోగాల కోసం వెళ్లాలనుకుంటున్న లక్షలాది మంది భారతీయుల్లో ఆందోళన నెలకొంది.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి

*** సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ అగ్ని కణం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ బి సత్యం అధ్యక్షతన బుధవారం షాపూర్ నగర్ శుభం హోటల్ సెంటర్లో ఐలమ్మ చిత్రపటానికి సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు భూమి భుక్తి వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడారన్నారు. ఐలమ్మ చిన్నతనంలోనే తమ భూమిని పండించిన పంటను ఆక్రమించుకోవడానికి వచ్చిన విసునూరు రామచంద్రారెడ్డి గుండాలపై కమ్యూనిస్టు పార్టీ అండతో తిరగబడి తను పండించిన పంటను ఇంటికి చేర్చిన వీర వనిత ఐలమ్మ అని అన్నారు. అలాంటి వీరుల త్యాగాలను గుర్తు చేసుకోవడం కోసం సెప్టెంబరు 10 వీరనారి ఐలమ్మ వర్ధంతి నుండి దొరల భూస్వాముల నిజాం పరిపాలన అంతమైన, సెప్టెంబర్ 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆనాడు భూమి భుక్తి వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగువేల మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించారన్నారు. ఆనాడు జరిగిన సాయుధ పోరాటం లో కుల మతాలకు అతీతంగా హిందువులు ముస్లింలు ప్రజలంతా ఐక్యమై ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో దొరల నిజాం రజాకార్ల సైన్యాల ఆకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడుతూ భూమిలేని పేదలకు దాదాపు 30 లక్షల ఎకరాల భూమిని ఎర్రజెండా అండతోటి పేదలకు పంచిన చరిత్ర ఎర్రజెండాదని అలాంటి ఎర్రజెండా త్యాగాన్ని ఈరోజు కొన్ని మతోన్మాద శక్తులు ఆ రోజు జరిగిన పోరాటాన్ని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందూ ప్రజల తిరుగుబాటుగా వక్రీకరిస్తున్నారని అన్నారు. వీరనారి అయిలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రావుల స్వాతి, పార్టీ సీనియర్ నాయకులు జి వెంకన్న, కే శీను, తిమ్మప్ప, భాష ఆంజనేయులు, సైదులు లక్ష్మి, బీరయ్య తదితరులు పాల్గొన్నారు

## రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

*** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 13న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగ జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ బుధవారం లైబ్రరీ మీటింగ్ హాల్ లో న్యాయవాదులతో జరిగిన సమావేశంలో తెలిపారు. న్యాయవాదులు తమ వివాదాలను సామరస్యంగ , త్వరగ పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, వివాహ బంధానికి సంబంధించిన కేసులు , ఎన్. ఐ యాక్ట్ మరియు మీడియేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కావున కక్షిధారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, గోపికృష్ణ, అడపాల పార్వతి, చిన్ని కృష్ణ, పురుషోత్తం రావు నిరంజన్ రావు, సీనియర్ జూనియర్,న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో బాలికను వేధించిన నింధితుడికి మూడేళ్లు జైలు శిక్ష



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : బాలికను ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తికి జైలు శిక్ష ఖరారైంది. జగద్గిరిగుట్ట సీఐ నరసింహ తెలిపిన వివరాల మేరకు ఎల్లమ్మబండ మహంకాళి నగర్ కు చెందిన కుమార్ (30) కార్మికుడు. ఇదే ప్రాంతానికి చెందిన బాలికను మూడేళ్ల క్రితం ప్రేమ పేరుతో బాలికను వేధించాడు. బాధితుల ఫిర్యాదులు ఫిర్యాదుతో అప్పట్లో కేసు నమోదు అయింది. విచారణ అనంతరం కూకట్పల్లి ఫాస్ట్ ట్రాక్కోర్టు విచారణ చేపట్టి తాజాగా నిందితుడు కుమార్ కు శిక్ష ఖరారు చేసింది. మూడేళ్ల జైలు తో పాటు రూ 10 వేలు జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు. కేసులో కీలకంగా వ్యవహరించిన కాశీనాథ్ ను ఉన్నతాధికారులు అభినందించారు..

## లయన్స్ క్లబ్ హైదరాబాద్ రాజధాని ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం...



మల్కాజ్ గిరి, (ప్రజాస్ఫూర్తి) : మహిళల్లో పెరుగుతున్న మహమ్మారి ఒకప్పుడు పదులలో ఉన్న సంఖ్య క్యాన్సర్ బాధితులు ఇప్పుడు వేళల్లో ఉన్నారని డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కే ఇన్నారెడ్డి అన్నారు. మల్కాజ్గిరి లోని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాజధాని ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు మల్కాజ్గిరి లోని నేరేడ్మెట్ లో గల రాజధాని మోడల్ హైస్కూల్లో ఎం. ఎన్. జె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ & రీజినల్ క్యాన్సర్ సెంటర్ హైదరాబాద్ సహకారంతో దాదాపుగా 105 మంది మహిళలు డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఫర్ క్యాన్సర్ అవేర్నెస్ లయన్ టి హేమలత ఆధ్వర్యంలో మహిళలలో ప్రధానంగా మౌఖిక క్యాన్సర్, స్థన క్యాన్సర్, గర్భాశయ గొంతు క్యాన్సర్లను గుర్తించడం కోసం పరీక్షలు చేపట్టారు. రోగాలు పెరుగుతున్నా కొద్ది... కార్పొరేట్ హాస్పిటల్స్ క్యాన్సర్ కి చికిత్స పేరుతో ప్రాథమిక సమయంలో గుర్తించక వెళ్లిన వారిని దండుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ వీ కృష్ణ ప్రసాద్, ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ లయన్ కళ్యాం కృష్ణారెడ్డి, సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ లయన్ మందా సురేష్ కుమార్, పిడిజె లయన్ వెంకట్ నారాయణరెడ్డి, డి సి ఎస్ లయన్ రవికుమార్ యాదవ్, డిసిసి లయన్ సంపత్ కుమార్, జి ఎం టి కోఆర్డినేటర్ లయన్ ఏవిఆర్ దత్తు, జిఎస్టి కోఆర్డినేటర్ జెడ్సిస్ రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి, నాగన్న ,శేఖర్ రెడ్డి, మూలావతి శ్రీనివాసరావు, అశోక్ కుమార్, వి పద్మావతి, శ్రీధర్, టి యాదగిరి ,జయవాని ,కవిత ,పూర్ణిమ, అధికారులు, కాలనీవాసులు, స్కూల్ సిబ్బంది ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## స్వాస్థ్ నారీ – శ్వశక్త్ పరివార్ అభియాన్ విజయవంతం చేయాలి

*** కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వాస్థ్ నారీ - శ్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్య రక్షణలో ఈ శిబిరాలు మైలురాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు.బీపీ, షుగర్, హృద్రోగాలు, పిసిఓడి, క్యాన్సర్ వంటి సమస్యలపై ఈ క్యాంపుల ద్వారా పరీక్షలు చేసి అవసరమైన చికిత్స, మందులు అందిస్తామని చెప్పారు. అక్టోబర్ 1న జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ ఆసుపత్రుల సాధారణ సేవలకు అంతరాయం కలగకుండా ఈ ప్రత్యేక శిబిరాలు సమన్వయంతో జరగాలని సూచించారు. మహిళా సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో అదనపు కలెక్టర్ విద్య చందన, జిల్లా వైద్యాధికారి జయలక్ష్మి, డిసిహెచ్ఓ రవిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## 3 కోట్ల రూపాయలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు

*** కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని కి అభినందనలు తెలిపిన ఏఐఎస్ఎఫ్ నాయకులు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి గత 50 సంవత్సరాలవుతుందని గత ప్రభుత్వాలను అనేక రకాలుగా వినతలు అందించిన విద్యార్థులతో కలెక్టరేట్లు ముందు ఆందోళన నిర్వహించిన గత పాలకులు విద్యారంగాన్ని విస్మరించారని ప్రభుత్వ విద్యా రంగాన్ని నీరుగార్చారని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కమ్యూనిస్టు పార్టీ కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు కృషితో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ప్రాంత అభివృద్ధికై విద్యారంగ సమస్యల విద్యార్థుల అభివృద్ధికి దోహదపడుతున్న కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావుకి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి పక్షాన అభినందనలు తెలియజేస్తూ విద్యార్థులు విద్యను అభ్యసించడానికి అధిక సంఖ్యలో ప్రభుత్వ కళాశాలలో చదువుకోటానికి 3 కోట్ల రూపాయలు వెచ్చించి విద్యను కాపాడేందుకు కృషి చేసారాని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణాలకు నిధులు కేటాయించేల చొరవ చూపటం సంతోషకరమని భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కూడా కృషి చేస్తారని ఆకాంక్షిస్తూ నమ్మని అన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్, నాయకులు కళ్యాణ్ , మహేష్ ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన గ్రామ అభివృద్ధికి ఆది కర్మయోగి అభియాన్ పథకం ఒక వరం

*** ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల ఏర్పాటులో ఆది కర్మ యోగి అభియాన్ శిక్షణా కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికైన ఏడు గ్రామాల అభివృద్ధి కోసం టీం వర్క్ ద్వారా పనిచేసి, విజన్-2030 వరకు సంక్షేమ పథకాలు గిరిజనులకు చేరేలా ప్రణాళిక చేయాలి అని సూచించారు. రెండవ రోజు ముగింపు సమావేశంలో ఫారెస్ట్, రెవెన్యూ, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాల అధికారులు,డిఆర్డిఏ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఏపీఓ పోరండ్ల రంగా, ఏపిఎం మీరాభి, టీం లీడర్ హెచ్.ఎం. ప్రకాష్ రావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి లత, హెచ్ డబ్ల్యూ.ఓ పవన్ కుమార్, సి.సి. శ్రీను, హెల్త్ సూపర్వైజర్ సడల దేవి, హెచ్ఎంలు భద్రు,విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 40,వ వర్ధంతి సందర్భంగ పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్, కంచర్ల శ్రీనివాసరావు, రజక సంఘం రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రధాన కార్యదర్శి జాఫర్, సుదర్శన్ కోరి, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల శ్రీనివాసరావు, శాతల్లగిరి, వచ్చా వెంకటేశ్వర్లు, చిన్న శ్రీను, కొడారి రాజేందర్, గుండంపల్లి సతీష్, దాసు, కమల్, రామకృష్ణ, మహిళ నాయకురాలు బొందిలి విజయ, శ్వేత, ఈ కార్యక్రమానికి హాజరయ్యారు చాకలి ఐలమ్మ కు ఘన నివాళి తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామానికి చెందిన ఎలకరాజు సత్యనారాయణ గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకుడు చింతపల్లి పురుషోత్తం రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో పిల్లల చదువుకు ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చీమకండ్ల కిష్టయ్య, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి తీగుళ్ల బాలకృష్ణ, మాజీ వార్డు సభ్యులు దోర్నాల సత్తయ్య, బండ్ల భాగ్యమ్మ, బోయిని నరసింహ, బండ్ల శ్రీకాంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చెక్క రాములు, గరిశె జంగయ్య, తీగుళ్ల రామచంద్రం, తీగుళ్ల రాములు, దోర్నాల నరేష్, గరిశె వెంకటేష్, ఉప్పునూతల మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన త్రినిటీ పాఠశాల విద్యార్థులు

*** అభినందించిన పాఠశాల చైర్మన్ కెవిబి కృష్ణారావు, ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ ఉజ్జీని మంజుల**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీన చౌటుప్పల్ లోని ముస్కు మధుసూదన్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లో మండల స్థాయి అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలో నిర్వహించారు. ట్రినిటీ పాఠశాల విద్యార్థులు అండర్ 14 బాలుర ఖోఖో విభాగంలో ఎస్. జశ్వంత్, బి చరణ్ సాయి, అండర్ 17 బాలుర ఖోఖో విభాగంలో ఎన్. మణి శ్రీకర్, అండర్ 17 బాలుర వాలీబాల్ విభాగంలో ఎస్. శ్రీ హర్ష, అండర్ 14 బాలికల కబడ్డీ విభాగంలో కే. మనీష, అండర్ 17 బాలికల ఖోఖో విభాగంలో వి.దీక్షిత, అండర్ 17 బాలుర కబడ్డీ విభాగంలో ఎస్.నరసింహారెడ్డి, కే.మనోజ్, పి.నిశాంత్, అండర్ 14 బాలుర కబడ్డీ విభాగంలో కే. నరసింహ, వి. యశ్వంత్, అండర్ 14 బాలికల ఖోఖో విభాగంలో బి.హన్సికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను ట్రినిటీ పాఠశాలల చైర్మన్ కెవిబి కృష్ణారావు, ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ ఉజ్జీని మంజులలు బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల మీరు మీ కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి

**ఇల్లందు డీఎస్పీ ఎన్ చంద్రబాను**

ప్రజాస్ఫూర్తి , ఇల్లందు: సైబర్ నేరాల పట్ల మీరు మీ కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఇల్లందు డిఎస్పి ఎన్ చంద్రబాను సూచించారు. బుధవారం సాహితీ జూనియర్ కాలేజీలో విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ గంజాయి ఇతర మత్తు పదార్థాల గురించి, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి ఎన్ చంద్రబాను పాల్గొని మాట్లాడుతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదన్నారు.ప్రతి విద్యార్థి చదువు పై దృష్టిసారించాలని సూచించారు. చదువు కోవడం ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి మంచి ఉద్యోగ అవకాశాలు అంది పోచుకోవడం జరుగుతుంది అన్నారు. చెడు వ్యసనాలకు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ సరఫరా చేసిన విక్రయించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గంజాయి డ్రగ్స్ ఇతర పదార్థాలకు దూరంగా ఉండాలని చదువుపై దృష్టి సారించి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగుతూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. డ్రగ్స్ (మత్తు పదార్థాలు) వాడటం వల్ల ఆరోగ్యంపై, కుటుంబంపై, సామాజిక జీవితంపై, ఆర్థిక పరిస్థితులపై భారీ నష్టాలు జరిగే అవకాశం ఉంది. డ్రగ్స్ మూలంగా సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలను వివరిస్తూ మాధకద్రవ్యాల లను తరిమి కొట్టడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, యువత కూడా మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ మాధకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని యువతకు పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు నేర్చుకోవడం చాలా ముఖ్యం,మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. అధిక వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ లేజర్ గన్ ద్వారా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దని సూచించారు, తల్లిదండ్రులు కూడా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు దాటేటప్పుడు రోడ్డుపై నడిచేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ దశలో కష్టపడి చదివితే జీవితం బాగుపడుతుంది.ఈ కార్యక్రమంలో కాలేజీ యజమాన్యం తో పాటు ఇల్లందు ఎస్ హెచ్ ఓ, టి. సురేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు






## కొయ్యలగూడెంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కైరంకొండ అశోక్ మాజీ సర్పంచ్ గడ్డం నరసింహ, దంత బాల నరసింహ, బొడ్డు సైదులు గౌడ్, కొయ్యడ రవి గౌడ్, జిల్ల నరసింహ, వర్కాల సత్యనారాయణ, అల్మాసిపేట రామకృష్ణ, జలంధర్, కొయ్యడ రాములు తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

* **ఆకుల ఇంద్రసేనారెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ బస్టాండ్ ఆవరణలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఆనాడు భూస్వాములకు వ్యతిరేకంగా, భూమి కోసం భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన ధీరశాలి వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. కొంగు నడుము చుట్టి దేశ్ ముఖి దొరలని తరిమికొట్టి, తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిన బహుజన వీరశాలి చాకలి ఐలమ్మ అన్నారు. మండల రజక సంఘం ప్రధాన కార్యదర్శి సామకూర యాదయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ ముకుటులోజు దయాకరాచారి, రజక సంఘం నాయకులు బాతరాజు యాదయ్య, అంజయ్య, పాలమాకుల అశోక్, కానుగు శివ, మలిగే బసవయ్య, తూర్పాటి శంకర్, వర్కల రాము, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సాదాబైనామాల క్రమబద్ధీకరణకు రంగం సిద్ధం

రాష్ట్రంలో తెలంగాణ భూ భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్ 2025 ప్రకారం సాదాబైనామాల క్రమబద్ధీకరించనున్నట్లు బుధవారం సీసీఎల్ఏ లోకేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 11 వరకు దాఖలైన అప్లికేషన్ల వరకే రెగ్యులరైజ్ చేస్తారు. ఆర్వోఆర్ 2020లో వీటిని పరిష్కరించేందుకు అవకాశం లేకపోవడంతో హైకోర్టులో కేసు ఫైల్ అయ్యింది. ఇటీవల భూ భారతిలో తీసుకొచ్చిన మార్పులకు అనుగుణంగా పరిష్కరించేందుకు అవకాశం ఉందని న్యాయస్థానం గుర్తించింది. దాంతో పెండింగులో ఉన్న 9 లక్షలకు పైగా అప్లికేషన్లను పరిశీలించి, రెగ్యులరైజ చేసేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సీసీఎల్ఏ జిల్లా కలెక్టర్లను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భూ భారతి చట్టం 2025 సెక్షన్ 6 సబ్ సెక్షన్ 1 ప్రకారం అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను రెగ్యులరైజ్ చేయనున్నారు. రైతులు సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములను వారి పేరిట మ్యుటేషన్ కి అవకాశం లభించింది. 2014 జూన్ 2 అంటే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నాటికే కొనుగోలు చేసినట్లుగా డాక్యుమెంట్లు ఉంటేనే పరిగణనలోకి తీసుకుంటారు. ఆ తర్వాత కొనుగోలు చేసిన వాటికి అవకాశం లేదని జీవోలో స్పష్టం చేశారు. తెలంగాణ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదారు పాస్ బుక్స్ యాక్ట్, 1971 ప్రకారం 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10 వరకు సమర్పించిన దరఖాస్తుల వరకే ఈ జీఓ పరిమితం కానున్నది. భూ భారతి చట్టం 2025 లో సెక్షన్ 6(1) ప్రకారం ఆర్డీవో స్థాయి అధికారికి క్రమబద్ధీకరణ అధికారాలను కట్టబెట్టారు.



## త్వరలో అందుబాటులోకి రానున్న ఓపెన్ జిమ్

* **క్రీడా ప్రాంగణం చుట్టూ వీధిలైట్లు**
* **మెయిన్ గేట్ వద్ద సెక్యూరిటీ రూమ్, సీసీ కెమెరాలు**
* **ప్రజాస్ఫూర్తి కథనానికి స్పందన..**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం :ప్రారంభానికి ముందే మందుబాబులకు అడ్డాగా మారిన రామవరంలోని పార్క్ కమ్ ఓపెన్‌జిమ్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని కొత్తగూడెం కార్పొరేషన్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. 'తాగు... ఊగు.. పడుకో' శీర్షికతో ఈనెల 8వ తేదీన 'ప్రజాస్ఫూర్తి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కొత్తగూడెం కార్పొరేషన్ అధికారులు స్పందించారు. రామవరం పాత రామచంద్ర సైన్స్ కళాశాల స్థలంలో సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్న తెలంగాణ క్రీడా ప్రాంగణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు పనులు ప్రారంభించారు. బుధవారం ఏఈ శ్రీకాంత్, మేనేజర్ శివ, శ్రావణ్ తదితర అధికారులు ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ వచ్చే 20 రోజుల్లో ఓపెన్ జిమ్, చిన్నపిల్లల ఆటవస్తులు, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రాంగణం చుట్టూ వీధి దీపాలు ఏర్పాటు చేయడం, ప్రధాన గేటు వద్ద సెక్యూరిటీ గార్డ్ రూమ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు.



**ఓపెన్ జిమ్ ఆట వస్తువులకు తాళం**

ఇంకా ప్రారంభం కాని ఓపెన్‌జిమ్‌లో ఉన్న పరికరాలను మద్యపానప్రియులు దుర్వినియోగం చేస్తుండటంతో అవికాస్తా ప్రారంభం కాకముందే మరమ్మతులకు గురయ్యే పరిస్థితి ఉంది. దీంతో ఓపెన్‌జిమ్ ఆటవస్తువులకు కార్పొరేషన్ అధికారులు తాళాలు వేశారు. త్వరలోనే ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెప్పారు.

## తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక వీరవనిత చాకలి ఐలమ్మ

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమర సాహసంతో పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో, ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం చరిత్ర సృష్టించిన చాకలి ఐలమ్మ పోరాటపటిమ నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగం అమూల్యమని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆమె ఆశయాలను స్మరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత, మహిళలు ఆమె పోరాట స్ఫూర్తిని అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ చూపిన దారి స్త్రీ సాధికారతకు, సామాజిక సమానత్వానికి మార్గదర్శకత్వం చేస్తుందన్నారు. ఆమె జీవితం నుంచి తీసుకునే స్ఫూర్తి



నేటి తరాలకి మానవ విలువలు, సామాజిక న్యాయం, ధైర్యసాహసాల పాఠం నేర్పుతుందని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, బీసీ సంఘ నాయకులు అజిత్ కుమార్, ముదిగొండ రాంబాబు, సర్వేష్, జంగంపల్లి రాజు, దురిశెట్టి కుమార్, విజయలక్ష్మి, కొదుమూరి సత్యనారాయణ, కాపర్తి వెంకటాచారి, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాచలంలో దేవి నవరాత్రి మహోత్సవాలకు పందిరి రాట కార్యక్రమం

* **పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర గుడి ప్రాంగణంలో దసరా సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ విజయదుర్గ దేవి అమ్మవారి దేవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ శర్మ పంతులు ఆధ్వర్యంలో జరిగిన పందిరి రాట ముహూర్త కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆటో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మురళి కృష్ణ, జర్నలిస్ట్ శ్రీధర్ ,మహిళలు,యువకులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఈనాటి తరాలకు ఆదర్శం

* **మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**



శేరిలింగం పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రైతాంగ, కార్మిక ఉద్యమాల్లో చాకలి ఐలమ్మ పోషించిన త్యాగం, పోరాట స్ఫూర్తి ఈనాటి తరాలకు ఆదర్శమని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భముగా వివేకానందనగర్ డివిజన్ ఈనాడు కాలనీ లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్ర పటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధురాలి వల్లే మన రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించగలిగిందన్నారు. పేదల కోసం, అణగారిన వర్గాల కోసం ఆమె చేసిన త్యాగాలను ఎప్పటికీ మరవలేమని అన్నారు.

## బోధన్‌లో ఉగ్ర కలకలం.. అనుమానితుడి అరెస్ట్

బోధన్: నిజామాబాద్ జిల్లా బోధన్‌లో అనుమానిత ఉగ్రవాది ఎన్ఐఏ అధికారులకు పట్టుబడటం కలకలం రేపింది. స్థానిక పోలీసుల సహకారంతో బోధన్ పట్టణంలో బుధవారం తెల్లవారు జామున విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన ఎన్ఐఏ, పటియాలా పోలీసులు.. ఐసిస్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు అనుమానిస్తున్న హుజైఫా ఎమన్‌ను అదుపులోకి తీసుకున్నారు. బోధన్ కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం పీటీ వారెంట్‌పై ఢిల్లీకి తరలించారు. నిందితుడి నుంచి ఎయిర్ పిస్తోల్ స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

# రాజీ మార్గమే రాజ మార్గం

* **జాతీయ లోక్ అదాలత్, చెక్ బౌన్స్ కేసుల పరిష్కార ప్రత్యేక లోక్ అదాలత్**
* **చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రాజీ మార్గమే రాజ మార్గమని చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం , భూదాన్ పోచంపల్లి చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ కోర్టు ప్రాంగణములో కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ బెంచీ ఈ నెల 13వ తేదీ వరకు ప్రతీరోజు నిర్వహించనున్నట్లు తెలిపారు. తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ వారిని ఆదేశించారు. రాజీచేసుకోదగిన అన్ని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ట్రాఫిక్ చలనా కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఎక్సైజ్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, కోర్టు వరకు రాకుండా ఉన్న బ్యాంకు, చిట్ ఫండ్, టెలిఫోన్ సంస్థల బాకీ వివాదాలు ప్రి లిటిగేషన్ కేసులుగా పెండింగులో ఉన్న కేసులును కూడా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారంతో అప్పీలు లేని తీర్పును పొంది సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని సూచించారు.




# ట్రంప్‌తో కాదు.. వాటితోనే నిద్రలేని రాత్రులు : కేంద్రమంత్రి పీయూష్ గోయల్

భారత్ వస్తువులపై 50 శాతం సుంకాలతో ట్రంప్ విరుచుకుపడిన సమయంలోనే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో సంస్కరణలు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ రెండింటికీ ఎటువంటి సంబంధం లేదని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడిన ఆయన.. ట్రంప్ వరుస సుంకాలతో నిద్రలేకుండా చేస్తున్నారా? అన్న ప్రశ్నకు ఆసక్తికరంగా బదులిచ్చారు. గత కొన్ని నెలలుగా డొనాల్డ్ ట్రంప్ ఊహించని నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో భారత్ అమెరికాలు వాణిజ్య చర్చలపై మల్లగుల్లాలు పడుతున్న సమయంలోనే అమెరికా



అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ 'డెడ్ ఎకానమీ' అని చెబుతూనే.. ప్రధాని మోదీ తనకు మంచి మిత్రుడని అన్నారు. ఇలా భిన్న ప్రకటనలు చేస్తుండటం మీకు నిద్రలేని రాత్రులు మిగిల్చాయా? అని అడిగిన ప్రశ్నకు గోయల్ నవ్వుతూ సమాధానమిచ్చారు. ప్రతిక్షణం భారత ప్రజల సేవలో నిమగ్నం కావాలని ప్రధాని మోదీ ఇచ్చిన ఆదేశాలే తనకు ఎన్నో నిద్రలేని రాత్రులు మిగిల్చాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ అంశాల గురించి ఎక్కువగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, భారత్ స్వతహాగానే ఓ శక్తి అని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. 140 కోట్ల జనాభా దూరమైతే నష్టపోయేది వారేనని.. భారత్‌కు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు.



## సరదాగా రమ్మంటే

# దేశ సరిహద్దు దాటాడు.. చివరకు..!

అమృత్‌సర్: సోషల్ మీడియాలో పరిచయమైన యువతి కోసం భారత్‌లోకి చొరబడేందుకు యత్నించి దొరికిపోయాడు. దాదాపు నాలుగేళ్ల తర్వాత విడుదలై.. తిరిగి స్వదేశానికి చేరుకున్నాడు. సరిహద్దు దాటి రావాలంటూ తాను సరదాగా చెప్పానని, కానీ అతడు నిజంగానే వస్తాడని ఊహించలేదంటూ ఆ యువతి పేర్కొనడం గమనార్హం. ఇదీ పాకిస్థాన్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్ కథ. బహావల్‌పుర్‌కు చెందిన అహ్మద్‌కు 2017లో ముంబయిలోని యువతితో స్నాప్‌చాట్‌లో పరిచయం ఏర్పడింది. ఇది కాస్త ప్రేమగా మారింది. ఆమెను కలిసేందుకు సరిహద్దు దాటి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించాడు. 2021 డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో భారత్ పాక్ సరిహద్దులో భద్రతాదళాలకు పట్టుబడ్డాడు. అనంతరం అతడిని జైలుకు తరలించారు. ఇక్కడికి రావాలంటూ తాను జోక్ చేశానని, అతడు నిజంగానే వస్తాడని అనుకోలేదని ఆమె కోర్టులో విచారణ సందర్భంగా చెప్పింది. ఈ క్రమంలోనే.. భారత కస్టడీ నుంచి విడుదలైన అహ్మద్ ఇరుదేశాల ప్రభుత్వాలకు ఓ విజ్ఞప్తి చేశాడు. భారత్ పాకిస్థాన్‌లు పరస్పరం ఖైదీలను విడుదల చేయాలని కోరాడు.

# లంచం సొమ్మును గాల్లోకి విసిరిన పోలీసు.. ఎగబడిన జనం

ఢిల్లీ: లంచం తీసుకుంటూ పట్టుబడటంతో తప్పించుకోవడానికి ప్రయత్నించిన ఓ పోలీసు అధికారి ఆ డబ్బులను గాల్లోకి విసిరేశాడు. దీంతో అక్కడ ఉన్న జనం అందులో రూ.5వేలను తీసుకొని పారిపోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన పోలీస్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాకేష్ కుమార్ ఓ తప్పుడు కేసులో ఇరికిస్తానని బెదిరిస్తున్నారని ఇటీవల ఓ వ్యక్తి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ.15,000 లంచం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపాడు. దీంతో పోలీసు అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవాలనే



పథకంతో అధికారులు రసాయన పొడిని చల్లిన నోట్లను ఇచ్చారు. హౌజ్ ఖాజీ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం బాధితుడు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాకేష్ కుమార్‌కు రూ.15,000 లంచం ఇచ్చి.. విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విజిలెన్స్ అధికారులు పోలీస్ స్టేషన్‌కు రావడాన్ని గమనించి అప్రమత్తమైన రాకేష్ కుమార్ ఆధారాలను నాశనం చేయడానికి లంచంగా తీసుకున్న నోట్లను గాల్లోకి విసిరాడు. అయితే అప్పటికే అక్కడ ఎక్కువమంది ప్రజలు ఉండడంతో ఆయన నోట్లను విసిరివేయగానే అందరూ ఒక్కసారిగా డబ్బు కోసం పోటీపడ్డారు. వారిని వారించి అధికారులు రూ.10వేలు స్వాధీనం చేసుకున్నప్పటికీ.. ఎగిరిన నోట్లు రూ.5వేలను తీసుకొని జనం ఉడాయించారు. అనంతరం అధికారులు రాకేష్ కుమార్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

# ఎన్టీఆర్ పిలుపుతో.. అస్సాంలో 'తెలుగు కాలనీ' కథ!

గువాహటి: అస్సాం రాజధాని గువాహటిలో అనేక రాష్ట్రాల ప్రజలు ఉన్నప్పటికీ.. బి.బరూహ్ రోడ్డు వెనక ఉన్న కొన్ని ప్రాంతాలకు ఓ ప్రత్యేకత ఉంది. చూడటానికి అది ఓ కాలనీ మాదిరిగా కనిపించినప్పటికీ ఆ కుటుంబీకుల ప్రస్థానంలో ఎన్నో మలుపులు కనిపిస్తాయి. కన్నీటి వలసలు, ఆకలి, నివసించడానికి కనీసం చోటు కూడా లేని పరిస్థితులు వారి జ్ఞాపకాల్లో మెదులుతూనే ఉంటాయి. అదే గువాహటిలో తెలుగు కాలనీ కథ. రెండో ప్రపంచయుద్ధం సమయంలో బర్మాలో (ప్రస్తుత మయన్మార్) స్థిరపడిన విదేశీయులను వెళ్లిపోవాలని అక్కడి ప్రభుత్వం ఆదేశించింది. వారికి మరో దారి లేక దేశాన్ని వీడాల్సివచ్చింది. ఎటు వెళ్లాలో తెలియదు. బస్సులు, రైళ్లు లేవు. మ్యాప్ లేదా గైడ్ కూడా లేరు. వేలాది కుటుంబాలు ప్రాణాలు అరచేత పట్టుకొని.. అడవులు, నదులు, కొండల బాట పట్టాయి. చివరకు భారత్‌కు చేరేందుకు దాదాపు మూడు నెలలు పట్టింది. అలాంటి పరిస్థితుల్లో వేలాది భారతీయ కుటుంబాలు (ఎక్కువగా తెలుగు) అస్సాంకు వలస వచ్చాయని గువాహటిలో స్థిరపడిన తెలుగు మూలాలున్న వ్యక్తులు వెల్లడించారు.



**30 మందితో మొదలై..**

బర్మా నుంచి తిన్‌సుకియా (అస్సాంలోని ఓ ప్రాంతం) వచ్చిన కుటుంబాల్లో ఓ 30 మంది గువాహటికి వచ్చి స్థిరపడినట్లు సమాచారం. అలా నగరంలో తెలుగువారి ప్రస్థానం మొదలైంది. తొలుత బి.బరూహ్ రోడ్డు సమీపంలోని ఓ అటవీ ప్రాంతంలో నివాసం ఏర్పర్చుకుని స్థానికంగా పనిచేయడం మొదలుపెట్టారు. కాలక్రమేణా.. వారి బంధువులు ఒక్కొక్కరుగా రావడంతో వీరి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 50వేల జనాభా ఉన్నట్లు అంచనా. వేలాది కి.మీ దూరంలో ఉన్నప్పటికీ తెలుగు పండగలు చేసుకుంటారు. కొందరు ఔత్సాహికుల ప్రయత్నంతో తెలుగు భాషపైనా పట్టు సాధించడం విశేషం.

**పేరు అలా వచ్చింది..**

తొలుత ఈ ప్రాంతాన్ని మరుస్థలిగా పిలిచేవారు. జనాభా పెరుగుతున్నకొద్దీ మద్రాజీ కాలనీగా పిలవడం మొదలుపెట్టారు. కానీ, 1984లో నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు గువాహటిని సందర్శించిన సందర్భంగా ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు తెలుగు కాలనీగా ముద్ర పడింది. ఇది కేవలం పేరు మాత్రమే కాదని, ఇదో గుర్తింపు అని తెలుగు మూలాలు ఉన్న స్థానికులు వివరించారు.



# ఈ దుర్గాదేవి ఉత్సవాలు..

## మతసామరస్యానికి ప్రతీక

కటక్: చారిత్రక నగరమైన ఒడిశాలోని కటక్ దుర్గాదేవి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. ఇందుకోసం దేవతా విగ్రహాల రూపకల్పనలో అనేక మంది కళాకారులు నిమగ్నమయ్యారు. ముఖ్యంగా అమ్మవారి అలంకరణలో భాగంగా వినియోగించే వెదురు ఫ్రేముల తయారీలో మతసామరస్యం వెల్లివిరుస్తుంది. వివిధ డిజైన్లతో కూడిన జరీ మేధాలను తయారు చేయడం నైపుణ్యంతో కూడుకున్నది. కొందరు ముస్లిం కళాకారులు ఎన్నో ఏళ్లుగా వీటిని రూపొందిస్తున్నారు. వెదురు, పేపర్, జింక్, మైనం, జరీ, వెల్వెట్ వంటి వస్తువులను వాడే ఈ డిజైన్ల రూపకల్పనను అక్షయ తృతీయ రోజు నుంచి మొదలుపెడతారు. ఒక్కో దాన్ని తయారు చేసేందుకు 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. కటక్ నుంచి మాత్రమే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వీటికి భారీ సంఖ్యలో ఆర్డర్లు వస్తున్నాయని, దాదాపు 100 మండపాలకు అవసరమైన మేధాలను అందిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కోదాని ఖరీదు రూ.10వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఉంటుందన్నారు. హిందువుల పండగైనప్పటికీ.. తమ నైపుణ్యంతో ముస్లిం కళాకారులు కూడా ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావడం మతసామరస్యానికి చిహ్నంగా నిలుస్తోందని మండపాల నిర్వాహకులు చెబుతున్నారు.

# మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం..

## పొరుగు దేశాల్లో పరిస్థితి చూడండి: సుప్రీంకోర్టు

నేపాల్‌లో యువత నిరసనలు హింసాత్మకంగా మారాయి. దీంతో అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం బంగ్లాదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా.. దేశాన్ని వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు. ఈ పరిణామాల నడుమ ఓ కేసు విచారణ సమయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను ఉటంకిస్తూ.. మన రాజ్యాంగం పట్ల గర్వపడుతున్నట్లు పేర్కొంది. రాష్ట్రాల బిల్లుల ఆమోదంలో న్యాయస్థానం తనకు గడువు నిర్దేశించడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరిన అభిప్రాయం అంశమై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం వాదనలు కొనసాగాయి. సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో



జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. ఈక్రమంలోనే రాజ్యాంగాన్ని ప్రస్తావించిన సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్.. ప్రజాప్రాముఖ్యం కలిగిన లేదా ప్రజలను ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై సుప్రీం కోర్టు సలహా కోరే హక్కు రాష్ట్రపతికి ఉందన్నారు. "మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం. పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి. నేపాల్‌లో పరిస్థితి గమనించండి" అని వ్యాఖ్యానించారు. "అవును.. బంగ్లాదేశ్‌లోనూ" అంటూ జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందించారు. బిల్లులను నెల రోజులకు పైగా రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్ల అధికారాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమర్థించారు. అటువంటి కేసులు తక్కువే ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన అన్ని బిల్లుల్లో 90 శాతం బిల్లులకు గవర్నర్ నెలలోపే సమ్మతి తెలుపుతారని చెప్పారు. 1970 నుంచి 2025 వరకు తమిళనాడుకు చెందిన ఏడు బిల్లులు సహా కేవలం 20 బిల్లులు మాత్రమే రిజర్వ్‌లో ఉన్నట్లు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

# తల్లికి పోషణ ఖర్చుల నిరాకరణ..

## కుమారుడికి జైలు

కాసర్‌గోడ్: వృద్ధురాలైన తల్లికి పోషణ ఖర్చులు చెల్లించేందుకు నిరాకరించిన ఓ వ్యక్తికి కేరళలోని కోర్టు జైలుశిక్ష విధించింది. 'తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007' కింద ఎలియమ్మ జోసెఫ్‌కు నెలకు రూ.2 వేల చొప్పున ఖర్చులు చెల్లించాలని ఆమె కుమారుడు, మాడిక్కై మాలప్పచెరికి చెందిన ప్రతీశ్‌కు ట్రైబ్యూనల్ గతంలో ఆదేశించింది. దీన్ని అతడు పట్టించుకోలేదు. దీంతో ఆమె మరోసారి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే పలుమార్లు నోటీసులు వచ్చినా బేఖాతరు చేశాడు. ఖర్చులు చెల్లించేందుకు మొండికేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి.. కాన్హాగఢ్



ఆర్డీవో కోర్టు ముందు హాజరుపరిచారు. అక్కడా అదే వాదన వినిపించాడు. ఈ క్రమంలోనే ఆరు నెలల బకాయిలు రూ.12 వేలు చెల్లించే వరకు అతడిని జైలులో ఉంచాలని కోర్టు ఆదేశించింది.

# చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహన సాంకేతికత బదిలీలో ముందడుగు

చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎస్ఎల్వీ) సాంకేతికతను బదిలీ చేసుకోవడంలో హాల్ ముందడుగు వేసింది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్, ఇస్రోలు బెంగళూరులో ఒప్పందంపై సంతకం చేశాయి. ఎస్ఎస్ఎల్వీ సాంకేతికత అనేది మూడు దశలతో కూడిన వాహనం. 500 కిలోగ్రాముల కంటే తక్కువ బరువున్న ఉపగ్రహాలను భూమి దిగువ కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి ఉపయోగపడుతుంది. ఒప్పందం ప్రకారం హాల్ తొలి రెండు సంవత్సరాలలో సాంకేతికతను అందిపుచ్చుకుంటుంది. తర్వాత 10 సంవత్సరాల పాటు ఉత్పత్తి దశలో కొనసాగుతుంది. అలాగే హాల్‌కు పూర్తి డిజైన్, రూపకల్పన, నాణ్యత, నియంత్రణ, అనుసంధానం, ప్రయోగ కార్యకలాపాలు, పోస్ట్ ఫ్లైట్ విశ్లేషణ డాక్యుమెంటేషన్, శిక్షణ సహా సాంకేతికతకు ప్రత్యేకమైన, బదిలీ



చేయలేని లైసెన్స్ దక్కుతుంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లను తీర్చడానికి ఎస్ఎస్ఎల్వీ సాంకేతికతను భారీగా ఉత్పత్తి చేసే బాధ్యతను హాల్ చేపట్టనుంది. 'హాల్ ప్రయత్నాలు ఎస్ఎస్ఎల్వీల స్వదేశీ తయారీని నిర్ధరించడమే కాకుండా భారతీయ ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, విస్తృత పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థకు కొత్త అవకాశాలు సృష్టిస్తాయి' అని హాల్ సీఎండీ డీకే సునీల్ తెలిపారు. తాజా ఒప్పందం ద్వారా హాల్ ప్రయోగ వాహనాన్ని నిర్మించడానికి, హక్కులు పొందడానికి, నిర్వహించడానికి స్వయం ప్రతిపత్తిని కలిగిఉంటుంది. దీంతో శాటిలైట్ మార్కెట్‌లో హాల్ పాత్ర విస్తరించనుంది. ఒప్పందంపై సంతకాలు చేసే కార్యక్రమంలో హాల్ సీఈవో జయకృష్ణన్, ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్, ఎన్ఎస్ఐఎల్ ఛైర్మన్ ఎం.మోహన్, ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ సాంకేతిక డైరెక్టర్ రాజీవ్ జ్యోతి, ఛైర్మన్ పవన్ కుమార్ గోయెంకా, హాల్ డైరెక్టర్లు, సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# సాదా బైనామాల దరఖాస్తుల పరిష్కారానికి నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్: తెల్లకాగితాలపై రాసుకున్న భూ కొనుగోళ్ల ఒప్పందాల (సాదాబైనామా) క్రమబద్ధీకరణకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో సుమారు 9 లక్షల మంది రైతులకు ఊరట లభించనుంది. భూ భారతి చట్టం ప్రకారం క్రమబద్ధీకరణకు రెవెన్యూశాఖ చర్యలు ప్రారంభించింది. 2020 ఆర్వోఆర్ చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు లేకపోవడంతో అప్పట్లో ఈ ప్రక్రియను న్యాయస్థానం నిలిపివేసింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపడతామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలుమార్లు ప్రకటించారు. న్యాయస్థానంలో ఉన్న వివాద పరిష్కారానికి పలు చర్యలు చేపట్టారు. దీంతో తాజాగా హైకోర్టు సాదాబైనామా రైతులకు 13బీ ప్రొసీడింగ్స్ జారీ చేయడానికి అనుమతించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని పట్టణాలు మినహా ఇతర ప్రాంతాల్లో 2014 జూన్ రెండో తేదీ ముందు వరకున్న సాదాబైనామా కొనుగోళ్లను.. 2016లో నాటి ప్రభుత్వం తొలిసారి క్రమబద్ధీకరించింది. అప్పట్లో 12.64 లక్షల దరఖాస్తులు రాగా.. పరిశీలన అనంతరం 6.18 లక్షల మేర క్రమబద్ధీకరించారు. రెండోసారి 2020లో క్రమబద్ధీకరణకు అవకాశమిస్తూ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. కానీ ఆర్వోఆర్ 1971ను సవరించి తెచ్చిన ఆర్వోఆర్ 2020 చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు చేర్చలేదు. పైగా 2020 చట్టం అమలులోకి రావడానికి ముందు, ఆ తర్వాత దరఖాస్తులను స్వీకరించడం న్యాయ వివాదానికి దారితీసింది. 1971 నాటి చట్టం అమల్లో ఉన్నప్పుడు తీసుకున్న దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశాలిచ్చింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలనుకున్నా ఈ ప్రక్రియ మొత్తం నిలిచిపోయింది. అప్పుడు వచ్చిన 9,00,894 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి.

**భూ భారతిలో సెక్షన్లు**

ఆర్వోఆర్ 2020 స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోఆర్ 2025 భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్ 6 ద్వారా సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. విచారణాధికారిగా ఆర్డీవోకు బాధ్యతలు అప్పగించారు. క్రమబద్ధీకరణ పూర్తయితే రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీ కావడంతోపాటు




ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్లు మ్యుటేషన్ల ద్వారా పెద్ద ఎత్తున రాబడి సమకూరనుంది.

## పోటీ పరీక్షల విషయంలో గత ప్రభుత్వ వైఖరినే కాంగ్రెస్ కొనసాగిస్తోంది : రామచందర్‌రావు

హైదరాబాద్: గ్రూప్ 1 పరీక్ష పత్రాలు రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి లక్షలాది మంది విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. టీజీపీఎస్సీ వ్యవస్థలో ఉన్న లోపాలు బయటకు వచ్చాయని చెప్పారు. నోటిఫికేషన్ విడుదల నుంచి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం వరకు టీజీపీఎస్సీ చాలా లోపాలతో కూడిన విధానాలను అవలంబించిందని ఆరోపించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, ఈ తీర్పు ద్వారా వారికి న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు.



గత భారత రాష్ట్ర సమితి హయాంలో పేపర్ లీకేజీ ఘటనలతో వేలాది మంది విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అదే పరంపరను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు.

## ఇన్సాస్ రైఫిల్ చోరీ.. నేవీ కానిస్టేబుల్, అతని సోదరుడు అరెస్ట్

ఆసిఫాబాద్: ఇన్సాస్ రైఫిల్ చోరీ కేసులో నేవీ కానిస్టేబుల్, అతని సోదరుడిని ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేటమండలం ఎలకపల్లి గ్రామానికి చెందిన దుబ్బల రాకేశ్ 2023లో నేవీలో చేరారు. 2025 ఫిబ్రవరి వరకు ముంబయిలో నేవీ విభాగంలో విధులు నిర్వహించి ఆ తర్వాత కేరళలోని ఎర్నాకుళం బదిలీఅయ్యారు. సెప్టెంబరు 6న రాకేశ్ ముంబయిలోని నేవీ కేంద్రానికి వెళ్లి అతని సోదరుడు ఉమేశ్ సహకారంతో సెంట్రీ ఏరియాలో ఉన్న ఇన్సాస్ రైఫిల్, 3 మ్యాగ్జిన్లు, 40 బుల్లెట్లు దొంగిలించారు. అనంతరం స్వగ్రామమైన ఎలకపల్లికి చేరుకున్నారు. ఈ ఘటనపై నేవీ అధికారుల ఫిర్యాదు మేరకు



ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధారాలు సేకరించి నిందితులు రాకేశ్, ఉమేశ్‌లను ఈ రోజు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఇన్సాస్ ఆయుధం, 3 మ్యాగ్జిన్లు, 40 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈకేసులో ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు సహకరించిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, పెంచికల్‌పేట్ ఎస్ఐ అనిల్ కుమార్, ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అభినందించారు.

## ఈ నెల 14 వరకు తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం



హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ నెల 14 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం, శుక్రవారం ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో.. వచ్చే నాలుగు రోజుల పాటు హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, భూపాలపల్లి, మహబూబాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, జిల్లాల్లో పలు చోట్ల.. గురువారం కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందన్నారు. దీంతో పలు జిల్లాలకు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. జోగులాంబ జిల్లాలో ఇవాళ సాయంత్రం పిడుగుపాటుకు ముగ్గురు కూలీలు మృతి చెందారు.

**హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం**

బుధవారం సాయంత్రం సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి తదితర ప్రాంతంలో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందులు ఎదుర్కొన్న నగరవాసులు ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. భారీ వర్షంతో రహదారులపై నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## కుక్కర్ మూతతో కొట్టి..
# కూకట్‌పల్లిలో మహిళ హత్య

కూకట్‌పల్లి: నగరంలోని కూకట్‌పల్లిలో ఓ మహిళ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్‌లో నివసించే రేణు అగర్వాల్ (50) అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కాళ్లు, చేతులు కట్టేసిన స్థితిలో ఆమె మృతదేహం కనిపించింది. ప్రెజర్ కుక్కర్ మూతతో తలపై కొట్టి, కత్తులతో పొడిచి హత్య చేసినట్లు గుర్తించారు. ఇంట్లో పనిచేసే ఇద్దరు బిహార్ యువకులే ఈ దారుణానికి ఒడిగట్టారని



అనుమానిస్తున్నారు. మహిళను చంపి.. నగలు, నగదుతో వారు బైక్‌పై పరారైనట్లు సమాచారం.

## జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలి: కేటీఆర్

హైదరాబాద్: అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉంటుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు అందరి ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి అని పేర్కొన్నారు. ఓటుకు రూ.5 వేలు పంచితే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సీఎం సోదరుడు చెరువులో ఇల్లు కట్టినా హైడ్రా వెళ్లదని.. కానీ పేదల బస్తీలకు వెళ్లి ఇళ్లు కూలగొడతారని విమర్శించారు. "ఉపఎన్నిక కోసం సర్వేలు చేయిస్తున్నాం.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగుంది. కొన్ని బస్తీల్లో వెనకంజలో ఉన్నాం. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు ఉంటే తొలగించాలి.. లేనివారివి చేర్చాలి. ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు బంద్ చేస్తామని.. ఇళ్లు కూలుస్తామని అంటారు. పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ మూసీ ప్రాజెక్టుకు డబ్బులు ఉన్నాయట. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చూపాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరు. జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలి" అని కేటీఆర్ అన్నారు. మాగంటి గోపీనాథ్‌లాగే తనకూ అండగా నిలవాలని కార్యకర్తలను ఆయన సతీమణి సునీత కోరారు. గోపీనాథ్



ఆశయాలను నెరవేర్చేందుకు అందరమూ కలిసి పనిచేద్దామన్నారు. భారత రాష్ట్ర సమితిలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉందని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు.

## కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే..
## నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా: రాజాసింగ్

హైదరాబాద్: భాజపా రాష్ట్ర నాయకత్వంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి విమర్శలు గుప్పించారు. "కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే.. నేను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఇద్దరం కలిసి ఎన్నికలకు వెళ్దాం. భాజపా నాకు ఎలాంటి సహకారాలు అందించలేదు. పార్టీలో నేను ఎలాంటి పదవి ఆశించలేదు. ఇప్పుడున్న కమిటీతో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాదు. ఈ కమిటీతో అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా. పార్టీని నాశనం చేస్తున్నదెవరో మరోసారి చెబుతా. దిల్లీ పెద్దలు నాకు తరచూ ఫోన్ చేసి మాట్లాడతారు. నాకు ఎప్పటి నుంచో కేంద్రంలోని పెద్దల ఆశీర్వాదం ఉంది. వాళ్లను కలిసి పార్టీలో జరిగిందంతా చెబుతా. నేను ఎప్పటికీ భాజపా నేతనే. సెక్యులర్ వాదిని కాదు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్



పార్టీల్లో చేరను. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినందుకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఫోన్ చేసి తిట్టారు. నేను చేసే కామెంట్స్ పార్టీపై కాదు.. కొందరు నేతలపై మాత్రమే. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దిల్లీ పెద్దలు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా" అని రాజా సింగ్ తెలిపారు.

# పత్తి పొలంలో కూలీలపై పిడుగు.. ముగ్గురి మృతి

అల్లంపూర్: జోగులాంబ గద్వాల్ జిల్లా అయిజ మండలం భూంపురం గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం పత్తి చేనులో పని చేసుకుంటున్న కూలీలపై పిడుగు పడింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఓ యువకుడు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతులను భూంపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ (22), సర్వేశ్ (20), సౌభాగ్యమ్మ (40)గా గుర్తించారు.



# యూరియా కోసం అర్ధరాత్రి నుంచే రైతుల బారులు

మిరుదొడ్డి: సిద్దిపేట జిల్లాలోని మిరుదొడ్డి రైతువేదిక ఎదుట యూరియా కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం వరుసకట్టిన నేపథ్యంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అసహనానికి గురైన రైతులు వేదికలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. కేవలం 1120 యూరియా బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. అన్నదాతలు మాత్రం వేల సంఖ్యలో బారులు తీరారు. ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై కీర్తి కుమార్, మిరుదొడ్డి ఎస్సై సమతలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసుల సమక్షంలో భారీ



బందోబస్తు మధ్య యూరియాను రైతులకు పంపిణీ చేశారు. 3 వేల మంది టోకెన్లు దొరకక నిరాశతో వెనుతిరిగారు. మెదక్ జిల్లా శివ్వంపేట సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం మంగళవారం రాత్రి అక్కడే పడుకొని వేచిచూశారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం బారులు తీరారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్‌లో యూరియా కోసం రాత్రి నుంచి క్యూలో నిరీక్షించారు.

# రాణించిన ఐటీ, ఫైనాన్షియల్ షేర్లు..

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఫైనాన్సియల్, రియాలిటీ షేర్లు రాణించాయి. ఆటో, మీడియా స్టాక్స్ లాభాల స్వీకరణకు దిగడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,504.36 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,235.42 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,643.88 పాయింట్ల వరకు చేరింది. చివరకు 323.83 పాయింట్ల లాభంతో 81,425.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104.5 పాయింట్లు పెరిగి 24,973.10 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7శాతం వరకు పెరిగాయి.

నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ లాభాలను ఆర్జించాయి. అయితే, ఎంఅండ్ఎం, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, మారుతి సుజుకీ, టాటా మోటార్స్ నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే ఆటో ఇండెక్స్ ఒకశాతం, ఐటీ ఇండెక్స్ 2.6శాతం వృద్ధిని నమోదు చేసింది. పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2.2శాతం, రియాలిటీ ఇండెక్స్ ఒకశాతం దాకా పెరిగింది. అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ షేర్లు 16శాతం ర్యాలీ చేశాయి. అవంతి ఫీడ్స్ 15శాతం, కోస్టల్ కార్పొరేషన్ షేర్లు 20శాతం, గోకల్దాస్ ఎక్స్‌పోర్ట్స్ 4శాతం పెరిగాయి. వెల్స్పన్ లివింగ్ 8, అరవింద్ షేర్లు 4శాతం వృద్ధిని నమోదు చేశాయి.

# దిగివచ్చిన ఫ్యూచర్ గోల్డ్..

## తులానికి రూ.1.09లక్షల దిగువకు..!



**న్యూఢిల్లీ:** పసిడి ధరలు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇటీవల పెరుగుతూ వస్తున్నాయి. ట్రంప్ టారిఫ్, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, డాలర్ బలహీన నేపథ్యంలో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూ జీవితకాల గరిష్ఠాలకు చేరాయి. తాజాగా భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశలు, విదేశీ మార్కెట్లలో బలహీనంగా ఉండడంతో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ధరలు బుధవారం రికార్డు స్థాయి నుంచి దిగివచ్చాయి. తులం ధర రూ.1.09లక్షల దిగువకు చేరాయి. అమెరికాలో అంచనా వేసిన దానికంటే తక్కువ ఎంప్లాయిస్‌మెంట్ డేటా ప్రపంచంలోని యూఎస్ ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలను రేకెత్తిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఈ వారం చివరలో విడుదలకానున్న ద్రవ్యోల్బణ డేటాను పెట్టుబడిదారులు జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. ఈ గణాంకాలు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు వైఖరిపై సూచనలు ఇస్తాయని భావిస్తున్నారు. అక్టోబర్ డెలివరీకి బంగారం ఫ్యూచర్స్ ధర రూ.230 తగ్గింది. పది గ్రాములకు రూ. 1,08,830కి చేరుకుంది. డిసెంబర్ డెలివరీకి సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ రూ.249 తగ్గి రూ.1,09,839కి తగ్గింది. కమోడిటీ మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఇటీవలి వరుస ర్యాలీల తర్వాత బంగారం ధరలు జీవనకాల గరిష్టానికి చేరాయి. విదేశీ మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ మధ్య లాభాల స్వీకరణకు మదుపరులు మొగ్గుచూపగా.. ఇది బంగారం ధరలపై ఒత్తిడి తెస్తున్నది. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి ఉంటుందని భావిస్తున్నారు.

ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రధాని మోదీ 'ఎక్స్' పోస్ట్‌లో భారత్, యూఎస్ రెండుదేశాలు స్నేహితులని.. సహజ భాగస్వాములుగా పేర్కొన్నారు. మరో వైపు కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 3,679.02 డాలర్ల వద్ద స్థిరపడ్డాయి. ఈ సంవత్సరం ఇప్పటివరకు బంగారం ధరలు దాదాపు 40 శాతం పెరిగాయి. 2024లో 27 శాతం పెరుగుదలను నమోదు చేసిన తర్వాత ఔన్సుకు 3,700 మార్కును దాటయని ఆగ్‌మాంట్ పరిశోధన విభాగాధిపతి రెనిషా చైనాని తెలిపారు. సెంట్రల్ బ్యాంకుల ద్రవ్య విధానాలు, యూఎస్ డాలర్ బలహీనపడడం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు భారీగా బంగారం కొనడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక ఆందోళనలు బంగారానికి డిమాండ్ పెంచాయన్నారు. యూఎస్ సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య విధానం సమీప భవిష్యత్‌లో బంగారం ధరల సెంటిమెంట్‌పై బలమైన సంకేతాలను ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# అనిల్ అంబానీకి మరో షాక్..

## ఈడీ కొత్త మనీలాండరింగ్ కేసు దాఖలు



**న్యూఢిల్లీ:** ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి మరో షాక్ తగిలింది. ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. రూ.2,929 కోట్ల మోసం కేసులో అనిల్ అంబానీపై ఈడీ కొత్త మనీలాండరింగ్ కేసు దాఖలు చేసింది.

రూ.2,929.05 కోట్ల రుణ మోసం కేసులో అనిల్ అంబానీపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఇటీవలే చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అనిల్ అంబానీపై కేసు కూడా నమోదు చేసింది. ఈ కేసులో అంబానీకి చెందిన సంస్థలపై సీబీఐ ఇటీవలే సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. సీబీఐ దాఖలు చేసిన ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ ఆధారంగా తాజాగా ఈడీ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రూ.3 వేల కోట్ల రుణ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అనిల్ అంబానీని ఇప్పటికే విచారించిన విషయం తెలిసిందే.



# అభిషేక్ సిక్సర్ల మోత..

## 4.3 ఓవర్లలోనే మ్యాచ్ ముగించిన భారత్



**దుబాయ్:** పదిహేడో సీజన్ ఆసియా కప్‌ను భారత జట్టు అదిరపోయేలా ఆరంభించింది. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లో దడ పుట్టిస్తూ యూఏఈకి ముచ్చెమటలు పట్టించిన టీమిండియా.. ప్రత్యర్థులకు వణుకు పుట్టించే విజయంతో టోర్నీలో ఘనంగా శుభారంభం చేసింది. తొలుత కుల్దీప్ యాదవ్ (4-7), శివం దూబే(4-3)ల విజృంభణతో ప్రత్యర్థి 57కే పరిమితం అవ్వగా.. స్వల్ప ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ(30) సిక్సర్లతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్(19 నాటౌట్) సైతం దంచేయడంతో 4.3 ఓవర్లలోనే జయభేరి మోగించింది. 9 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా గ్రూప్ ఏ నుంచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఆసియా కప్‌ను భారీ విజయంతో మొదలు పెట్టింది. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమిండియా సంచలన బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థికి దిమ్మతిరిగే షాకిచ్చింది. 58 పరుగుల ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి బంతినే సిక్సర్‌గా మలిచాడు. ఆ తర్వాత బంతికి ఫోర్ బాదగా.. రెండో ఓవర్లో శుభ్‌మన్ గిల్(19 నాటౌట్) ఫోర్, సిక్సర్ కొట్టడంతో చూస్తుండానే లక్ష్యం కరిగిపోయింది.

జునైద్ సిద్ధిఖీ వేసిన నాలుగో ఓవర్లో సిక్సర్ రాబట్టిన అభిషేక్.. ఆ తర్వాత బంతికి ఔటయ్యాడు. అతడు వెనుదిరిగే సరికి టీమిండియా స్కోర్.. 48/1. విజయానికి పది పరుగులు మాత్రమే అవసరం కాగా.. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (7 నాటౌట్) ఎదుర్కొన్న మొదటి బంతినే స్టాండ్స్‌లోకి పంపాడు. నాలుగో ఓవర్ మూడో బంతిని గిల్ బౌండరీకి తరలించగా.. యూఏఈ జట్టు దారుణంగా ఓడిపోయింది.

### కుల్దీప్.. దూబే పడగొట్టారిలా

టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్న టీమిండియా యూఏఈని స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసింది. మొదట ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఓపెనర్ అలీషాన్ షరుఫు(22)ను ఔట్ చేసి జట్టుకు తొలి వికెట్ అందించాడు. దూకుడుగా ఆడుతున్న అతడిని యార్కర్ కింగ్ క్లీన్ బౌల్డ్ చేయడంతో.. 26వద్ద ఆతిథ్య జట్టు మొదటి వికెట్ కోల్పోయింది. కాసేపటికే బంతి అందుకున్న వరుణ్ చక్రవర్తి ముహమ్మద్ జొహైబ్(2)ను డగౌట్ చేర్చాడు. ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ (4-7), శివం దూబే(4-3)లు మ్యాజిక్ చేశారు.

చైనామన్ బౌలర్ కుల్దీప్ విజృంభణతో 9వ ఓవర్లో రాహుల్ చోప్రా(3), కెప్టెన్ ముహమ్మద్ వసీం(19), హర్షిత్ కౌశిక్(2)లు వెనుదిరిగారు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే అక్షర్ పటేల్(13-1), దూబేలు మరో ఎండ్ నుంచి వికెట్ల వేట సాగించారు. 13వ ఓవర్లో రెండు వికెట్లు తీసిన దూబే ప్రత్యర్థిని ఆలౌట్ అంచున నిలిపాడు. చివరి వికెట్‌గా వచ్చిన హైదర్ అలీ(1)ని కుల్దీప్ ఔట్ చేయగా 57కే యూఈఏ ఇన్నింగ్స్ ముగిసింది.

# వరల్డ్ కప్ కోసం సీనియర్ పేసర్..





## శ్రీలంక స్క్వాడ్ ఇదే..!

**కొలంబో:** మహిళల వన్డే ప్రపంచకప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న శ్రీలంక తమ స్క్వాడ్‌ను ప్రకటించింది. చమరి ఆటపట్టు కెప్టెన్‌గా బుధవారం 15మందితో కూడిన పటిష్టటమైన స్క్వాడ్‌ను బోర్డు ఎంపిక చేసింది. ఇప్పటివరకూ ఒక్కసారి కూడా వరల్డ్ కప్ విజేతగా నిలవని ఈసారి మ్యాచ్ విన్నర్లతో బరిలోకి దిగుతోంది. స్వదేశంలో మెగా టోర్నీ జరుగుతున్నందున.. అనుభవజ్ఞురాలైన లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఉదేశికా ప్రదోధనికి స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు.

చమరి ఆటపట్టు సారథ్యంలో లంక జట్టు గొప్పగా ఆడుతోంది. రెండేళ్ల క్రితం ఆసియా కప్‌లో భారత జట్టును ఓడించి టైటిల్‌ను ఎగురేసుకుపోయింది లంక. అప్పుడు ఫైనల్ ఆడిన జట్టులోని కవిష దిల్హారి, హర్షిత సమరవిక్రమ, సుంగంధిక.. ఇప్పుడు వరల్డ్ కప్ బృందంలోనూ ఉన్నారు. 1997 నుంచి వన్డే వరల్డ్ కప్ ఆడుతున్న లంక ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదు.

2013 ఎడిషన్‌లో ఐదో స్థానంలో నిలవడమే ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన. అయితే.. ఆటపట్టు కెప్టెన్ అయ్యాక ఆ జట్టు ఆటే మారిపోయింది. సో.. ఈసారి కచ్చితంగా లంక తొలి టైటిల్ కోసం గట్టిగానే పోరాడనుంది. ప్రపంచ కప్ ఆరంభ పోరులో భారత జట్టును శ్రీలంక ఢీకొననుంది.

**శ్రీలంక స్క్వాడ్ :** చమరి ఆటపట్టు(కెప్టెన్), కవిష దిల్హారి, ఇనొకా రణవీర, హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, సుంగంధిక కుమారి, విష్మీ గుణరత్నే, అనుష్క సంజీవని, ఉదేశిక ప్రభోదని, ఇమేష దులానీ, దెవ్మీ విహంగ, అచినీ కులసూరియా, నీలాక్షక సిల్వా, పివుమీ వత్సలా, మల్కి మదరా.

# యూట్యూబర్ సప్నాగిల్ వివాదం..

## క్రికెటర్ పృథ్వీ షాకు కోర్టు జరిమానా



**న్యూఢిల్లీ:** యూట్యూబర్ సప్నాగిల్‌తో వివాదం కేసులో టీమ్‌ఇండియా క్రికెటర్ పృథ్వీ షాకు షాక్ తగిలింది. ఆయనకు కోర్టు ఫైన్ వేసింది. సప్నాగిల్ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానం ఇవ్వకపోవడంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జూన్ 13న క్రికెటర్ తరఫున న్యాయవాదికి చివరి అవకాశం ఇచ్చినప్పటికీ.. ఆయన ఇంకా స్పందన దాఖలు చేయలేదని పేర్కొంది. ఈ మేరకు రూ.100 ఫైన్ కట్టాలని ముంబై దిండోషి సెషన్స్ కోర్టు ఆదేశించింది. అంతేకాదు, పృథ్వీ షాకు మరో అవకాశం కల్పిస్తూ.. తదుపరి విచారణ డిసెంబరు 16కి వాయిదా వేసింది.

### అసలేం జరిగిందంటే..?

2023లో అంధేరి బార్‌లో పృథ్వీ షా, అతడి స్నేహితుడు అశిష్ యాదవ్‌లు తమతో గొడవ పడ్డారని.. ఇద్దరూ తమపై బేస్‌బాల్ బ్యాటుతో దాడి చేశారని సప్న గిల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరింది. కానీ, పోలీసులు పట్టించుకోలేదు. అయితే.. సప్న అనవసర రాద్ధాంతం చేస్తుందని, తనను కావాలనే ఇరికిస్తోందని షా సైతం ఆమెపై కంప్లైంట్ చేశాడు. దాంతో, సప్న ముంబై కోర్టును ఆశ్రయించింది.

## ఉద్యోగులకు రివార్డ్‌గా

# ఆసియా కప్ టికెట్లు..

**న్యూఢిల్లీ:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా ఆసియా కప్ టోర్నీ మొదలైంది. ఈ మెగా టోర్నీలో భారత్, పాకిస్థాన్ సహ, పలు కీలక మ్యాచ్‌లకు టికెట్లు హాట్‌కేకులా మారాయి. ఈ నేపథ్యంలో ఒక వ్యాపారవేత్త కీలక నిర్ణయం తీసుకున్నాడు. తన కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు ఆసియా కప్ టికెట్లు కొనిచ్చాడు. అలాఅనీ వంద రెండొందలు కాదు.. ఏకంగా 700 టికెట్లు పంచాడీ బాస్. ఇంతకూ అతడు ఎందుకిలా చేశాడో తెలుసా..? ప్రైవేట్ కంపెనీల్లో ఉత్తమంగా పనిచేసే ఉద్యోగులకు బొనాంజాలు, రివార్డులు మామూలే. కొన్ని సంస్థలు విలువైన బహుమతులు ఇస్తాయి. మరొకొన్నేమో కార్లు, ఇళ్ల స్థలాలు వంటివి ఇవ్వడం చూశాం. అయితే.. దుబాయ్‌కు చెందిన యజమాని తన స్టయిలే వేరని నిరూపించాడు. యూఏఈలో జరుగుతున్న ఆసియా కప్ మ్యాచ్ టికెట్లను ఉద్యోగులకు కానుకగా అందించాడు.



### ప్రతిభకు ప్రోత్సాహకంగా

డనుబే గ్రూప్ అనేది దుబాయ్‌లోని రియల్ ఎస్టేట్ కంపెనీ. ఇదే కాకుండా పలు వ్యాపారాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. 'యూఏఈలో ఆసియా కప్ వంటి మెగా టోర్నీలు జరగడం అరుదు. అలాంటి మ్యాచ్‌లు ఉన్నప్పుడు మా కంపెనీలో అలుపెరగకుండా పనిచేసి.. పురోగతిలో భాగమయ్యే ఉద్యోగులకు రివార్డ్ ఇవ్వాలనుకున్నాం. వాళ్లు తమ అభిమాన క్రికెటర్ల ఆటను ఆస్వాదించేలా చేయాలనుకున్నాం. అందుకే.. ఆసియా కప్ టికెట్లను పంపిణీ చేశాం' అని వైస్ చైర్మన్ అనిస్ సజన్ స్థానిక మీడియాకు తెలియజేశాడు.

'ఖలీజ్ టైమ్స్'తో అనిస్ సజన్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 14న జరుగబోయే భారత్ పాకిస్థాన్ మ్యాచ్ కోసం 100 టికెట్లు తీసుకున్నాం. ఈ హై ఓల్టేజ్ మ్యాచ్ ఒక్కో టికెట్ ధర రూ.8,742.47. అలానే సూపర్ 4 మ్యాచ్‌కు 100 టికెట్లు.. ఫైనల్ కోసం మరో వంద టికెట్లు కొనుగోలు చేశాం అని వెల్లడించాడు.




# తండ్రి అయిన వరుణ్ తేజ్...

## మగ బిడ్డకు జన్మనిచ్చిన లావణ్య
## ఆసుపత్రికి వెళ్లిన మెగాస్టార్ చిరంజీవి

**టాకీస్:** మెగా కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ప్రముఖ నటుడు వరుణ్ తేజ్, ఆయన సతీమణి, నటి లావణ్య త్రిపాఠి తల్లిదండ్రులయ్యారు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో లావణ్య ఓ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ వార్త తెలియగానే మెగా అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

విషయం తెలిసిన వెంటనే మెగాస్టార్ చిరంజీవి తన కొత్త చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' షూటింగ్ నుంచి నేరుగా ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ వరుణ్ తేజ్, లావణ్యలను కలిసి తన అభినందనలు, ఆశీస్సులు అందజేశారు. కుటుంబంలోకి కొత్త సభ్యుడి రాక పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వరుణ్, లావణ్యల ప్రేమ వివాహం గతేడాది జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు తమ కుటుంబంలోకి చిన్నారి అడుగుపెట్టడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ శుభవార్తతో కొణిదెల కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది.

# మిరాయ్‌లో ట్రైన్ సీక్వెన్స్ ఓ పెద్ద అనుభూతి



**టాకీస్:** తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిరాయ్' రితికానాయక్ కథానాయిక. మంచు మనోజ్ ముఖ్యభూమిక పోషించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబందం ప్రచారాన్ని ముమ్మరం చేసింది. తాజాగా ఇందులోని ట్రైన్ సీక్వెన్స్‌ను వివరిస్తూ ఓ బీటీఎస్ వీడియో విడుదల చేసింది. ఈ సీక్వెన్స్ సినిమాలో పెద్ద ఛాలెంజ్ అని.. కథను మలుపుతిప్పే సన్నివేశం అని టీమ్ పేర్కొంది. తేజ రిస్క్ చేసి ఇందులో నటించారని చిత్రబృందం తెలిపింది. ఇదిలావుంటే తన చిన్నప్పుడు మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటించినా.. మరోసారి ఆయనతో సినిమా చేయాలనుందని నటుడు తేజ సజ్జా తెలిపారు. అవకాశం వస్తే చిరుతో మల్టీస్టారర్ మూవీ చేస్తానన్నారు. తేజ హీరోగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రం 'మిరాయ్' చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తేజ సమాధానమిచ్చారు.

# కొత్త లోక హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్

## చిత్ర విజయంతో సూపర్ ఫీమేల్ హీరోగా ప్రశంసలు




టాకీస్: 'లోక చాప్టర్ 1: చంద్ర' తెలుగులో కొత్త లోకగా విడుదలై మంచి ఆదరణ తెచ్చుకుంది. ఇప్పటికే 200 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రంతో థియేటర్లలో కల్యాణి ప్రియదర్శన్ సందడి చేస్తున్నారు. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ రూ.కోట్లు- వసూలు చేస్తోంది. దీనిపై కల్యాణి ప్రియదర్శన్ ఆనందం వ్యక్తంచేశారు. దేశంలోనే మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమాలో నటించడం గర్వంగా ఉందన్నారు. మలయాళంలో 'లోక చాప్టర్ 1: చంద్ర' భారీ విజయం సాధించిన దగ్గర నుంచి అందరూ నన్ను ఫీమేల్ సూపర్ హీరో అని పిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేసింది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమా విజయం సాధించడానికి నాతో పాటు- మా టీమ్‌లోని వారంతా కష్టపడ్డారు. ఈ సక్సెస్ క్రెడిట్ వాళ్లకు కూడా వెళ్తుంది. నేను ఈ చిత్రానికి సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని మాత్రమే ఆలోచించాను. చిత్రీకరణ చేసే సమయంలోనే ఇది కచ్చితంగా విజయం సాధిస్తుందని అర్థమైంది. ఈ సినిమా మొత్తాన్ని నేను భుజాలపై వేసుకొని మోసానంటూ ప్రేక్షకులు నన్ను అభినందిస్తున్నారు. కానీ, మా టీమ్‌లో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ దీనికోసం కష్టపడ్డారు. 'లోక చాప్టర్ 1: చంద్ర' మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రల్లోనైనా చేయగలరు అని అందరికీ నమ్మకం కలిగిందని కల్యాణి ప్రియదర్శన్ చెప్పారు. డామినిక్ అరుణ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దుల్కర్ దీన్ని రూ.30 కోట్లతో నిర్మించగా.. ఇప్పటివరకూ రూ.200కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అత్యధిక వసూలు సాధించిన నాలుగో మలయాళ చిత్రంగా నిలిచిందని పేర్కొంది.

# వివాదంలో నయనతార డాక్యుమెంటరీ




టాకీస్: లేడి సూపర్‌స్టార్ నయనతార మరోసారి వివాదంలో చిక్కుకుంది. ఆమె నటించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్' ఇప్పటికే పలు వివాదాలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తమ అనుమతి లేకుండా 'నానుమ్ రౌడీ దాన్' సినిమా క్లిప్‌లను ఉపయోగించారని ఆ సినిమా నిర్మాత ధనుష్ అప్పట్లో నయనతారపై రూ. 10 కోట్ల పరువు నష్టం దావా వేశాడు. అయితే ఈ వివాదం ముగియకముందే తాజాగా మరో కేసులో ఇరుక్కుంది నయన్. ఈ డాక్యుమెంటరీలో తమ అనుమతి లేకుండా 'చంద్రముఖి' సినిమాలోని క్లిప్‌లను ఉపయోగించారంటూ 'ఏపీ ఇంటర్నేషనల్' అనే సంస్థ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చంద్రముఖి' సినిమా హక్కులు తమ వద్ద ఉన్నాయని, తమ అనుమతి లేకుండా డాక్యుమెంటరీలో ఆ సినిమా క్లిప్‌లను వాడారని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై నయనతార, నెట్‌ఫ్లిక్స్‌కు రూ. 5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ వివాదంపై సమాధానం ఇవ్వాలని నయనతార, నెట్‌ఫ్లిక్స్‌లకు నోటీసులు జారీ చేసింది. దీనిపై అక్టోబర్ 6 లోపు స్పష్టత ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కాగా ఈ రెండు వివాదాలతో నయనతార డాక్యుమెంటరీ ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తమ అనుమతి లేకుండా ఆ డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సన్నివేశాలు ప్రదర్శించడంపై నిర్మాణ సంస్థ 'ఏబీ ఇంటర్నేషనల్' మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. దీనిపై అక్టోబరు 6లోపు సమాధానమివ్వాలని డాక్యుమెంటరీని నిర్మించిన 'టార్క్ స్టూడియోస్'కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఆ సన్నివేశాలను తొలగించాలని, రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినా తమ కంటెంట్‌తో డాక్యుమెంటరీ ప్రసారం అవుతూనే ఉందని ఏబీ ఇంటర్నేషనల్ పిటిషన్‌లో పేర్కొంది.

## మెగాస్టార్‌ను కలుసుకున్న
# పూరిసేతుపతి బృందం



**టాకీస్:** అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా ప్రాజెక్ట్ 'పూరి సేతుపతి'. విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌లో టబు హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా.. తాజాగా ఈ చిత్రయూనిట్ మెగాస్టార్ చిరంజీవిని కలుసుకుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం అనిల్ రావిపూడితో కలిసి మన శంకరవరప్రసాద్ గారు అనే సినిమాను తెరకెక్కిస్తు న్నాడు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతుండగా.. ఈ సినిమా పక్కనే షూటింగ్ జరుపుకుంటు-న్న 'పూరి సేతుపతి' టీ-మ్ చిరుని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోను చిత్రబృందం ఎక్స్ వేదికగా పంచుకుంది. ఇందులో నటు-లు చిరంజీవితో పాటు- విజయ్ సేతుపతి, టబు, నయనతార, ఛార్మీ తదితరులు ఉన్నారు.

## కిష్కిందపురి నచ్చకుంటే
# చిత్రసీమ వదిలేస్తా

## హీరో బెల్లంకొండ శ్రీనివాస్ గట్టి నమ్మకం



టాకీస్: బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా వస్తున్న చిత్రం కిష్కింధపురి. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ జానర్ లో వస్తున్న ఈ సినిమా -ట్రైలర్ కు మంచి స్పందన లభించింది. బైరవం తర్వాత వస్తున్న ఈ సినిమాపై బెల్లం కొండ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. ఈ నెల 12న ఈ సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. కాగా ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బెల్లం కొండా మాట్లాడుతూ ' సినిమా అంటే రెండున్నర గంటలు ఆడియెన్స్ ని ఎంటర్‌టైన్ చేయడం. థియేటర్ లో కూర్చున్నపుడు ప్రేక్షకుడు బోర్ ఫీల్ అయి మొబైల్ చూడకుంటే ఆ సినిమా హిట్. నేను కాన్ఫిడెంట్ గా చెప్తున్న కిష్కిందపురి సినిమా స్టార్ట్ అయిన పది నిమిషాల తర్వాత ఆడియెన్స్ ఫోన్ చూడరు. ఒకవేళ అలా ఎవరైనా చూస్తే నేను అసలు ఇంకా సినిమాలు చేయను ఇండస్ట్రీ వదిలి వెళ్తాను. ఈ సినిమా అంత బాగుంటు-ంది. ఇది నేను ఛాలెంజ్ చేసి చెప్తున్నా. ఈ సినిమా కథపై నమ్మకంతో చెప్తున్న. కథ పరంగా, సౌండింగ్ పరంగా ఈ సినిమా చాలా బాగుంటుంది. ఆ నమ్మకంతో చెప్తున్న కిష్కింధపురి మిమ్మల్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని అన్నారు. బెల్లం కొండా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి బెల్లం స్టార్ మాటలు ఎంతవరకు నిజమవుతాయో రెండు రోజుల్లో తెలుస్తుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.